## ఆరవ పాఠం — الدرس السادس

## కలిమయే తౌహీద్ నిబంధనలు1/3 — شروط كلمة التوحيد ١/ ٣

ఈ పవిత్ర వచనం యొక్క నిబంధనలు ఏడున్నాయి. ఏ కొరత లేకుండా, ఏ దానిని వ్యతిరేకించకుండా వాటన్నిటినీ పాటిస్తేనే వాస్తవంగా కలియమే తౌహీద్ **(లాఇలాహ ఇల్లల్లాహ్)** పఠించినట్లు.

**1- ఇల్మ్ (జ్ఞానం):** 'అల్లాహ్ తప్ప వేరే ఆరాధ్యనీయుడు లేడు, ఇతరుల ఆరాధన వ్యర్థము, తుచ్ఛము' అని తెలుసుకున్న వ్యక్తి వాస్తవంగా దాని భావాన్ని తెలుసుకున్న జ్ఞాని. అల్లాహ్ ఆదేశం చదవండి: **{తెలుసుకో! ఆరాధనకు నిజమైన అర్హుడు అల్లాహ్ తప్ప మరెవడూ లేడు}.** (ముహమ్మద్ **47:19**).

ఇంకా ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా సెలవిచ్చారు: **"ఆరాధనకు నిజమైన అర్హుడు అల్లాహ్ తప్ప మరెవడూ లేడు" అని తెలుసుకొని మరణించినవారు స్వర్గములో చేరుదురు".** (ముస్లిం 26).

**2- యఖీన్ (నమ్మకం):** ఏ సందేహం లేకుండా మనశ్శాంతి కలిగే పూర్తి నమ్మకంతో, గాఢ విశ్వాసంతో ఈ పవిత్ర వచనం పఠించాలి. అల్లాహ్ ఆదేశం: **{అల్లాహ్‌ను, ఆయన ప్రవక్తను (దృఢంగా) విశ్వసించి, తరువాత ఎలాంటి సందేహానికి తావీయకుండా ఉన్నవారే నిజమైన విశ్వాసులు}.** (సూర హుజురాత్ **49:15**).

ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం ఇలా సెలవిచ్చారని అబూ హురైరా రజియల్లాహు అన్హు ఉల్లేఖించారు: **"ఆరాధనకు నిజమైన అర్హుడు అల్లాహ్ తప్ప మరెవడూ లేడు" మరియు "నేను అల్లాహ్ యొక్క ప్రవక్తనని" సాక్ష్యమిచ్చుచున్నాను. ఎవరు ఏలాంటి సందేహం లేకుండా ఈ రెండు సాక్ష్యాలతో అల్లాహ్ ను కలుసుకుంటాడో అతడు స్వర్గంలో ప్రవేశిస్తాడు".** (ముస్లిం 27).

**3- ఖుబూల్ (సమ్మతించుట):** ఈ పవిత్ర వచనం ద్వారా రుజువయ్యే విషయాలన్నిటినీ మనసావాచా సమ్మతించాలి. అల్లాహ్ మరియు ప్రవక్త సల్లల్లాహు అలైహి వసల్లం తెలిపిన విషయాలన్నిటినీ విశ్వసించాలి. వాటిని అంగీకరించాలి, వాటిలో ఏ ఒక్క దానిని విస్మరించకూడదు. అల్లాహ్ ఇదే ఆదేశమిచ్చాడు:

**{తన ప్రభువు తరఫున అవతరింపజేయబడిన దానిని ప్రవక్త విశ్వసించారు. దానిని విశ్వాసులు కూడా విశ్వసించారు. వారంతా అల్లాహ్‌ను, ఆయన దూతలను, ఆయన గ్రంథాలను, ఆయన ప్రవక్తలనూ విశ్వసించారు. "మేము ఆయన ప్రవక్తల మధ్య ఎలాంటి విచక్షణను, భేదభావాన్నీ పాటించము" (అని వారు చెబుతారు). "మేము విన్నాము. విధేయులం అయ్యాము. మా ప్రభూ! మేము నీ క్షమాభిక్షను అర్థిస్తున్నాము. కడకు మేము మరలి రావలసింది నీ వద్దకే" అని అంటారు.}.** (బఖర **2: 285**).

ధర్మ శాసనాలను, హద్దులను ఆక్షేపించుట, లేక వాటిని నమ్మకపోవుట సమ్మతించుటకు వ్యతిరేకం. ఉదాహరణకుః కొందరు దొంగ మరియు వ్యభిచారునిపై విధించిన హద్దులను లేక బహుభార్యత్వం, ఆస్తుల పంపకం లాంటి తదితర విషయాలను ఆక్షేపిస్తారు, నమ్మరు. (అయితే ఇలాంటి వారు అల్లాహ్ యొక్క ఈ ఆదేశం వినలేదా, చదవలేదా?): **{అల్లాహ్, ఆయన ప్రవక్త ఏ విషయములోనైనా ఒక తీర్పు చేసినప్పుడు విశ్వాసి అయిన ఏ పురుషునికి, విశ్వాసురాలైన ఏ స్త్రీకి, తమ యొక్క ఆ విషయంలో స్వయంగా మళ్ళీ ఒక నిర్ణయం తీసుకునే హక్కు లేదు}.** (అహ్ జాబ్ **33: 36**).